

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

రంగారెడ్డి మంగళవారం 26-05-2026 సంపుటి: 02 సంచిక : 26 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday 26-05-2026 Volume :02 Issue: 26 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

## బహిరంగ ప్రదేశాల్లో
# నమాజ్ నిషేధం



- అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం
- అధికారులను ఆదేశించిన యూపి సీఎం

లక్నో
దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లఖ్‌నవూలో

-మిగతా 2 లో

# తెలంగాణలో రోహిణీ కార్తె ఎఫెక్ట్..



- తెలంగాణలో 46.5 దాటిన ఉష్ణోగ్రతలు
- కుమురం భీం నుంచి సూర్యాపేట వరకు రెడ్ అలర్ట్
- మరో మూడు రోజులు ఇదే తీవ్రత..
- ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్,
తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. రోహిణీ కార్తె ప్రవేశించిన వేళ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. తెలంగాణ ప్రణాళిక సంఘం మే 25న విడుదల చేసిన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎండ తీవ్రత

-మిగతా 2 లో



# పదవుల కోసం వారు అక్కర్లేదు

- పార్టీ కోసం, ఏపీ అభివృద్ధి కోసం పనిచేయండి
- ఎదుటి వారి విమర్శలను సహించడానికి లేము
- అవసరమైతే తాట తీస్తాం: పవన్ హెచ్చరిక

అమరావతి, మే 25 (నేటి దర్శిని)
:పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో

-మిగతా 2 లో

## కోటి మంది మహిళను
# కోటీశ్వరులను చేస్తాం

### ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 25 (నేటి దర్శిని)
తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

-మిగతా 2 లో





# పెట్రో మంట

- మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- పది రోజుల్లో నాలుగో సారి ధరలకు రెక్కలు
- సామాన్యుడిపై పెనుభారం.. మోడీ సర్కారుపై జనాగ్రహం

న్యూఢిల్లీ మే 25 (నేటి దర్శిని)
కేంద్రంలోని మోడీ సర్కారు దేశ ప్రజలకు విడతలవారీగా షాక్‌లు ఇస్తోంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలకు అదనపు భారం తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, లీటర్ డీజిల్‌పై రూ. 2.71 పెంచింది. పెరిగిన ఈ కొత్త ధరలు సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి

-మిగతా 2 లో



# బీజేపీవి రాజకీయ డ్రామాలు

- ఒక వైపు పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోంది
- మరో వైపు రైతులకు భరోసా అంటూ బస్సు యాత్ర
- రైతు వ్యతిరేక విధానాలతో ప్రజలకు మోసం
- రైతు పండించే ప్రతి గింజ కేంద్రం కొనాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

2




# మోదీ..గ్రేట్

- భారత్ అతి శక్తివంతమైన దేశమన్న ట్రంప్
- మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి
- మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం
- నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు
- భారత్ అమెరికాకు నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్
- ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తిన పెద్దన్న

2

## ఒక్క రక్తపు చుక్కతో
# క్యాన్సర్ నిర్ధారణ..



2

2




# మహిళా సాధికారతకు 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట

- రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలతో సరికొత్త రికార్డు
- వడ్డీ లేని రుణాల పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- ఒకేసారి 8 వేల స్వయం సహాయక సంఘాల భవనాలకు భూమిపూజ
- కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ మే 25 (నేటి దర్శిని)
రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8,000 సంఘాల భవన నిర్మాణాలకు వర్చువల్ విధానంలో జరిగిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న

-మిగతా 2 లో



## అట్టహాసంగా
# పద్మ పురస్కారాలు

- పలువరికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి
- కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు

న్యూఢిల్లీ, మే 25 (నేటి దర్శిని)
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు

-మిగతా 2 లో

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల
# తాగునీరిస్తాం

### ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం

- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటైనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



హైదరాబాద్, మే 25 (నేటి దర్శిని)
బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్

-మిగతా 2 లో

## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలు మోహరించాలని, సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలన్నారు.

## తెలంగాణలో రోహిణీ కార్తె ఎఫెక్ట్..

45 డిగ్రీల నుండి ఏకంగా 46.5 డిగ్రీల సెల్సియస్కు చేరడంతో జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న ఎండ తీవ్రత, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు, నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీలుగా ఎండ తీవ్రత నమోదైంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేసి రెడ్ అలర్ట్ పరిధిలోకి వచ్చేశాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విషయానికి వస్తే.. నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజ్ గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఎండలు ఉన్నాయి. కేవలం నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే నిన్నటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువగా నమోదై కాస్త ఉపశమనం కలిగించాయి. అయితే, రాబోయే మూడు రోజుల వాతావరణ ముందస్తు సూచనలు కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేవు. రానున్న రోజుల్లో ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాల్లో ఎండలు మరింత ముదిరి 45.7 డిగ్రీల వరకు వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

## పెట్రో మంట

దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. అయితే ఇది పది రోజుల వ్యవధిలో జరిగిన నాలుగో ధరల పెంపు కావడం గమనార్హం. దేశంలో వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలతో ఇప్పటికే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా పెంపు మరింత భారాన్ని మోపనుంది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు దాదాపు రూ.8 వరకు పెరిగాయి.

వివిధ నగరాల్లో పెరిగిన ధరలు ఇలా


తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు చేరుకోగా, డీజిల్ ధర రూ.95.20కు పెరిగింది. ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.18కి, డీజీల్ ధర రూ.97.83కి చేరింది. బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.110.93కి, డీజీల్ ధర రూ.98.80కి పెరిగింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77కు, డీజీల్ ధర రూ.99.55కు ఎగబాకింది. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.47కి, డీజీల్ ధర రూ.99.82కి చేరింది. ఇక తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.2.88 పెరిగి.. ధర రూ.115.73కి చేరుకుంది. లీటర్ డీజిల్‌పై కూడా రూ.2.88 పెరిగి.. ధర రూ.103.82కు ఎగబాకింది. మరోవైపు ఏపీలోని విజయవా డలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.75కి, లీటర్ డీజిల్ ధర రూ.105.43కు చేరింది.

## పదవుల కోసం వారు అక్కర్లేదు

బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

## ఒక్క రక్తపు చుక్కతో క్యాన్సర్ నిర్ధారణ..

**-సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేసిన చైనా పరిశోధకులు**
**-10 వేల రెట్లు ఎక్కువ కచ్చితత్వం**



**న్యూఢిల్లీ,**
క్యాన్సర్ నిర్ధారణలో వైద్యులు ప్రస్తుతం ఉపయోగిస్తున్న వైద్య పరికరాల పరిమాణం చాలా పెద్దది. చైనా సైంటిస్టులు.. దీనిని చేతిలో పట్టే ఒక పరికరంగా కుదించగలిగారు. 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' అనే పరికరాన్ని చైనాలోని (హాంగ్‌జౌ) 'వెస్ట్‌లేక్ వర్సిటీ' సైంటిస్టులు తయారుచేశారు. దీనిపై 'నేచర్ ఫొటోనిక్స్' జర్నల్ కథనం ప్రకారం, ఒకే ఒక్క రక్తపు చుక్కను తీసుకొని.. 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' పరికరం అత్యంత కచ్చితమైన ఫలితాన్ని ఇస్తుంది. సంప్రదాయ పద్ధతుల్లో ఉండే కచ్చితత్వంతో పోల్చితే..దీంట్లో 10,000 రెట్లు ఎక్కువ కచ్చితత్వంతో క్యాన్సర్‌ను గుర్తించొచ్చు. మన శరీరంలో క్యాన్సర్ ఉందా? లేదా? అన్నది చెప్పేది రక్తమే. దీంట్లో వచ్చిన మార్పులను గుర్తించడానికి కాంతి కిరణాలను ఉపయోగిస్తారు. దీనిని విశ్లేషించడానికి చైనా శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన 'త్రీడీ చిప్'ను ఉపయోగించారు. రక్తంలోని సూక్ష్మమైన మార్పును గుర్తించటంలో 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' పరికరానికి ఈ త్రీడీ చిప్ దోహదపడుతుంది.

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మోదీ..గ్రేట్

**-భారత్ అతి శక్తివంతమైన దేశమన్న ట్రంప్**
**-మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి**
**-మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం**
**-నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు**
**-భారత్ అమెరికాకు నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్**
**-ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తిన పెద్దన్న**

**న్యూఢిల్లీ,**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. భారత్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. మోదీ చాలా గ్రేట్.. ఆయనకు తాను పెద్ద అభిమానిని.. అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఏది కావాలనుకుంటే.. దానిని సాధించి తీరుతుంది.. అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



ఢిల్లీలో అమెరికా స్వాతంత్ర్య వేడుకలు

అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు ఢిల్లీలో కలర్‌ఫుల్‌గా జరిగాయి. ఈ నేపథ్యంలో భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో ఆధ్వర్యంలో ఆదేశ ఎంబసీ ఢిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ క్రమంలో భారతలోని యూఎస్ రాయబారి సిరియా గోర్, అలాగే రూబియోతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ లైవ్ ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ రికార్డులు సృష్టిస్తోందన్నారు. ఇక, రూబియో... అమెరికా చరిత్రలోనే గొప్ప విదేశాంగ కార్యదర్శిగా నిలుస్తారని ట్రంప్ అన్నారు. ఇక, భారత్ అంటే తనకు ఎంతో ఇష్టమని.. ప్రధాని మోదీ గొప్ప నాయకుడు.. తనకు మంచి స్నేహితుడు అంటూ చెప్పుకొచ్చారు. అంతేకాదు, నరేంద్రమోదీకి తాను పెద్ద అభిమానిని అన్నారు. భారత్‌కు ఎప్పుడైనా సహాయం అవసరమైతే.. తనను వందశాతం నమ్మవచ్చునన్నారు. భారత్‌కు ఏ అవసరం వచ్చినా.. నేరుగా తనకు కాల్ చేయవచ్చునన్నారు. ప్రధాని మోదీకి తన తరపున శుభాకాంక్షలు చెప్పాలని.. ఆయనకు తాను పెద్ద ఫ్యాన్‌ని అంటూ ఫోన్‌కాల్ ముగించారు.

త్వరలో ద్విపాక్షిక వాణిజ్య ఒప్పందం

ఇదిలాఉంటే.. అమెరికా, భారత్‌లు ద్విపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు దగ్గరలోనే ఉన్నాయని.. ఇది త్వరలోనే జరుగుతుందని మార్కో రూబియో ఆదివారం వెల్లడించారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతకుముందు రూబియో.. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి జైశంకర్‌తో భేటీ అయ్యారు.

# బీజేపీవి రాజకీయ డ్రామాలు

**-ఒక వైపు పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోంది**
**-మరో వైపు రైతులకు భరోసా అంటూ బస్సు యాత్ర**
**-రైతు వ్యతిరేక విధానాలతో ప్రజలకు మోసం**
**-రైతు పండించే ప్రతి గింజ కేంద్రం కొనాలి**
**-మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**

**తెలంగాణ బ్యూరో ప్రతినిధి :**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ, ప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు రైతు గోస -- బీజేపీ భరోసా పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెల్చి చెప్పారు. సోమవారం మంత్రి పొన్నం ఓ ప్రకటన విడుదల చేస్తూ... రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో రైతులపై సాగు వ్యయం భారీగా పెరిగిందన్నారు.. ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా ఖర్చులు అన్నీ పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ నిజంగా తెలంగాణ రైతులపై ప్రేమ ఉంటే పెట్రోల్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పైవ త్రిడి తేవాలన్నారు రైతులు పండించిన



ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో కేంద్రం విఫలమైంది. కొనుగోలు చేసిన ధాన్యంలో బాయిల్డ్ రైస్ సాంక్షన్ చేయడంలో, లేవీ రైస్ కు అనుమతులు ఇవ్వడంలో సహకరించడం లేదని మండి పడ్డారు. ఇప్పటికి కేవలం 53.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేగంగా యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.8,749 కోట్ల కనీస మద్దతు ధర చెల్లించిందన్నారు పొన్నం. వ్యవసాయ చట్టాల పేరుతో దేశవ్యాప్తంగా రైతులను ఇబ్బందులకు గురిచేసి, 700 మందికి పైగా రైతుల ప్రాణాలు పోయే పరిస్థితి తీసుకొచ్చిన బీజేపీ ఇప్పుడు రైతులకు భరోసా ఇస్తామని చెప్పడం నమ్మశక్యం కాదని. బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తూ రైతులకు మాత్రం నయా పైస రుణమాఫీ చేయకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం. అనిగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులపై లాఠీచార్జీలు చేయించిన ఘటనలు దేశం చూసింది. రైతుల బాధలను పట్టించుకోని బీజేపీ నేతలు ఇప్పుడు రైతు ప్రేమ గురించి మాట్లాడటం కపట నాటకం అన్నారు. తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## మహిళా సాధికారతకు 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట

చారిత్రాత్మక నిర్ణయాలను వివరించారు. గతంలో మహిళా సంఘాలకు సొంత కార్యాలయాలు లేకపోవడం వల్ల గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడేవారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. పంచాయతీ కార్యాలయాల్లోనో, సభ్యుల ఇండ్లల్లోనో, చివరకు స్థలం లేక చెట్ల కింద కూర్చొని సమావేశాలు నిర్వహించుకునే దుస్థితి ఉండేదన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ, మహిళలకు గౌరవప్రదమైన రీతిలో శాశ్వత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ 8 వేల కార్యాలయాల నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పుడు.. గత పదేళ్లుగా మహిళా సంఘాలను గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నాయకులు హేళన చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఏడాదికి రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఇప్పిస్తామని చెప్తే విపక్షాలు నవ్వారన్నారు. "మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మా నిబద్ధతతో నిరూపించాం. కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే ఏకంగా రూ. 60,000 కోట్ల రూపాయలను బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలకు అందించి చారిత్రాత్మక రికార్డు సృష్టించాం. రాబోయే రెండున్నర ఏళ్లలో ఈ మొత్తం రూ.లక్ష కోట్లే కాదు.. రూ. 1,25,000 కోట్లకు పైబడేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. మా సాధించిన ఈ విజయమే నాడు విమర్శించిన వారికి చెంపపెట్టు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు మరింత ఆర్థిక ఊతం ఇచ్చేందుకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఆయన తెలిపారు. గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కల చొరవతో రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం' అనే లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకానికి సంబంధించి నిర్దిష్టమైన టార్గెట్లు (లక్ష్యాలు) నిర్దేశించి, ఒక స్పష్టమైన టైమ్ క్యాలెండర్ ను రూపొందించాలని సీఎం ఆదేశించారన్నారు. ఇది ప్రభుత్వం యొక్క సంకల్ప బలానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని భట్టి విక్రమార్క కొనియాడారు. మహిళా సంఘాల సభ్యులందరూ ఈ ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా మరింత పైపైకి ఎదగాలని, దేశానికే దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్దాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిన్నరలోనే కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 24 గంటలు మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్వేల ఆధారంగా కార్పొరేటర్లకు టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో 3.39 కోట్ల ఓటర్లు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మన పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రతి ఓటు విలువైనదే.. నా పోలింగ్ బూత్ నా బాధ్యత అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు సుఖంగా జీవించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తమ హయాంలో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. పేదలు తెలియక ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుంటే జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చామని అన్నారు. రెండున్నర లక్షల మంది పేదలకు పట్టాలు ఇచ్చిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు.

## వరి కొనుగోలు కేంద్రాలు,రైస్ మిల్లులను

# సంయుక్తంగా పరిశీలన





వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లాకలెక్టర్,జిల్లా ఎస్పీ

బక్రీద్ సందర్భంగా చెక్ పోస్ట్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్. జిల్లా ఎస్పీ

- **జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,**
- **ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**

**మిడ్జిల్, మే 25 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ప్రస్తుతం జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోళ్లు పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఐఏఎస్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ల సంయుక్తంగా అడ్డాకల్ మండలంలోని వేముల గ్రామం వరి కొనుగోలు కేంద్రాన్ని అలాగే అడ్డాకల్ గ్రామంలోని రైస్ మిల్లును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన, టోకెన్ల జారీ, రవాణా తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునే ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైస్ మిల్లులో నిల్వలు, ధాన్యం దిగుమతి--ఎగుమతి ప్రక్రియ, మిల్లింగ్ పనితీరును పరిశీలించి సంబంధిత



అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని, కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వరి కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలు, అవినీతి లేదా రైతులను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు తలెత్తకుండా రెవెన్యూ, సివిల్ సప్లైస్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు.
రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపడుతున్న వరి కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

**బక్రీద్ పండుగ పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ముస్లిం సోదరుల బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పశువుల అక్రమ రవాణా జరగకుండా నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అడ్డాకల్ టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సంయుక్తంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ మరియు పశుసంవర్ధక శాఖ అధికారులకు పశువుల రవాణాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పశువుల అక్రమ రవాణా,చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా చట్టాన్ని గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి..



**ఆమనగల్లు,మే25(నేటి దర్శిని):**
పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి అని, ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మరికొందరికి ఎల్ఓసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని,సంక్షేమ పథకాలు పేదవారందరికీ అందుతున్నాయని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనుగోళ్లు పూర్తయ్యే వరకు రైతుల పక్షాన పోరాటం...

- **బిజెపి జిల్లా నాయకులు**



**మిడ్జిల్, మే25 (నేటి దర్శిని ప్రతినిధి):**
మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండలం రాణి పేట రైతు వేదిక కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం పై బిజెపి నాయకులు రైతులతో పరిశీలించారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్,యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, డిమాండ్ చేశారు. అనంతరం సివిల్ సప్లై డిఎం తో ఫోన్లో మాట్లాడి ట్రాన్స్ పోర్ట్ సమస్యలను పరిష్కరించాలని కోరగా లారీలు ట్రాక్టర్ల ద్వారా రవాణా ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. రైతులకు పూర్తి భరోసా కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని బిజెపి నాయకులు తెలిపారు. కొనుగోళ్లు జరగకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి , సతీష్, విష్ణువర్ధన్ ఆంజనేయులు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.....




జిల్లా అధికారులతో మాట్లాడుతున్న..బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాజేశ్వర్

## ధాన్యం కొనుగోలు విషయంలో

# పూర్తిగా విఫలమైన ప్రభుత్వం








- **టి.ఆర్.ఎస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జ్ కందడి మణిపాల్ రెడ్డి**
- **తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**

**ఆలేరు, మే25 (నేటి దర్శిని):**
రైతు ఆరు గాలం రక్తాన్ని చెమటగా మార్చి ధాన్యాన్ని పండిస్తే పండించిన పంటను కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరగడంతో రైతు కళ్ళల్లో కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. సోమవారం మోటకొండూరు మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ ఇంచార్జ్ కందడి మణిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం కందడి మణిపాల్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో రైతులు పండించిన పంట ఎక్కడ కల్లాలో అక్కడే నిలిగిపోతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేసే విషయంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవరిస్తుందని రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం తనకేమి సంబంధం లేదన్నట్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన నడుస్తుందని ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు,రైసు మిల్లర్లు అవినీతి అధికారులు సిండికేట్ అయి ప్రభుత్వం పాలించే నాయకులు చోద్యం చూసినట్లు చూస్తున్నారని అన్నారు . పేరుకే ప్రజాపాలన రాష్ట్రంలో రాజ్యమేలేది అవినీతి పాలన,దళారుల పాలన రాజ్యమేలుతుందని అన్నారు . రైతుల సమస్యను పరిష్కరించడంలో ధాన్యం కొనుగోలు చేసే విషయంలో పూర్తిగా ఈ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే రైతు పండించిన ధాన్యాన్ని వారం 10 రోజులలో కల్లాలలో ఒక గింజ ఉండకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని లేని పక్షంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి , మంత్రుల ఇల్లు ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు ఎత్తరి గణేష్,కొడె ఉపేందర్,కానుగంటి శ్రీనివాస్, వడ్డబోయిన బిక్షపతి,యాదగిరి,చంద్రయ్య, మల్లేష్,శ్రీధర్,బాలమ్మ, నర్సమ్మ,లక్ష్మి,చంద్రమ్మ, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు రైతులు మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు రాజకీయ రంగంలో చైతన్యాన్ని పెంపొందించుకోవాలి



**నాగోల్, మే25 (నేటి దర్శిని):**
మహిళలు ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య (ఐవీఎంఎస్) 11 వ వార్షికోత్సవ వేడుకలు సమాఖ్య ఫౌండర్ అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష రుద్రాక్ష రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్ష అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా దామోదర గుప్త, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణలు పాల్గొని మాట్లాడుతూ, మహిళలంతా సంఘటితంగా ఉండాలని, ఒకరికొకరూ తోడుగా ఉంటూ సమాజ హితానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. లోక కళ్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనియమని అన్నారు. ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య ఫౌండర్ అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... లోక కళ్యాణార్థం ప్రజలందరూ సుఖ సంతోషలతో ఉండాలని లక్ష రుద్రాక్ష రుద్రాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. సమాజ నిర్ణయాధికారంలో మహిళల పాత్ర కీలకం కావాలని, రాజకీయంగా చైతన్యవంతులై ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ వాసవి మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకంలో భాగస్వా ములయ్యారు. అధిక మాసం సందర్భంగా 33 మంది బ్రాహ్మణులకు సన్మానం చేసి బట్టలు పెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకుట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భూమ కల్పన, అదనపు జనరల్ కార్యదర్శి బాలభద్ర కల్పన, కోశాధికారి కోటగిరి సరిత, ఉపాధ్యక్షులు నాగ సంతోషి, రావుపల్లి పద్మ, స్వాతి, పావని, రేజింతల జ్యోతి, సంధ్యారాణి, బుక్క జ్యోతి, సృజన, చైతన్య రాణి ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- **లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత**

**చండూరు,మే25 (నేటి దర్శిని):**
చండూరు సోమవారం నాడు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నందు 3,85,500/- రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు అందరు కలిసి 13 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో



ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి కృషితో అనేకమంది పేద కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రయోజనం పొందుతున్నాయని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, బుషిపాక వాసు, కటకం రమేష్, కో ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, ఖలీల్, మొగుదాల వెంకన్న, షరీఫ్, ఐతరాజు మల్లేష్,బోడ వెంకటేష్, నల్ల సత్యనారాయణ, ఇరిగి వెంకటేశం, పన్నాలు లింగయ్య,పందుల సత్యం, గంట యాదయ్య,మాస కృష్ణ, జూలూరు వెంకటేశం,లతీఫ్, ఏకాలపు ఆంజనేయులు, ఇరిగి శంకర్, రావిరాల రాజు, బుషిపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ




భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పురా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్దకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పుకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్–జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్దాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్దాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

# రైతులకు తమిళనాడు సీఎం విజయ్ గుడ్‌న్యూస్..

### సహకార బ్యాంకులో వ్యవసాయ రుణాలు రద్దు

న్యూఢిల్లీ మే 25 (నేటి దర్శిని)
తమిళనాడు రైతులకు సీఎం విజయ్ శుభవార్త చెప్పారు. సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు గరిష్టంగా రూ.50,000 వరకు రుణమాఫీ లభిస్తుంది. ఈ పథకం వర్తించని ధనిక రైతులకు కూడా రూ.5,000 సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అది కూడా సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికే. విజయ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పేద, సన్నకారు రైతులకు అప్పుల నుంచి భారీ ఊరట లభించనుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల



తమిళనాడులోని 14.22 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. ఈ రుణ మాఫీ వల్ల ప్రభుత్వానికి రూ.2,044 కోట్ల భారం పడుతుంది. ఇటీవలి కాలంలో సీఎంగా విజయ్ తీసుకున్న కీలక నిర్ణయం ఇది. మరోవైపు కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం చేపట్టనున్న మేకేడాటు డ్యామ్ ప్రాజెక్ట్ నిర్మాణంపై కూడా అధికారులతో సీఎం విజయ్ చర్చించారు. కర్ణాటక చేపట్టనున్న ఈ ప్రాజెక్టును తమిళనాడు వ్యతిరేకిస్తోంది. దీనివల్ల తమ రాష్ట్రంలోని రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వం వాదిస్తోంది. కావేరి నదీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాలుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక, మేకేడాటు డ్యామ్ ప్రాజెక్ట్‌కు ఇటీవలే కర్ణాటక ప్రభుత్వం భూమి పూజ నిర్వహించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తమ రైతుల హక్కులకు నష్టం జరుగుతుందనేది తమిళనాడు ప్రభుత్వ వాదన. ఈ విషయంలో గతంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఇటీవలే సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ అంశం కేంద్ర నిపుణుల పరిధిలోకి వస్తుందని సుప్రీం కోర్టు తెలిపింది.కోర్టు ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయబద్ధమైన చర్యలను వేగవంతం చేయాలని సీఎం విజయ్ ఆదేశించారు. మేకేడాటు డ్యామ్ ప్రాజెక్ట్ ద్వారా తమ రాష్ట్రానికి తాగునీటి సమస్య తీరుతుందని, విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడుతుందని కర్ణాటక ప్రభుత్వం చెబుతోంది.

# ఎరువుల ధరలు ఊహించని రీతిలో పెరిగాయి

### - కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ మే 25 (నేటి దర్శిని)
ఫెర్టిలైజర్ల ధరలు అనూహ్య రీతిలో పెరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫోరెక్స్.. ఈ మూడింటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల వల్ల. ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయని, దేశంలో అన్నింటిపై వ్యయం పెరిగినట్లు ఆమె చెప్పారు. ముంబైలో జరిగిన స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన 37వ వార్షికోత్సం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాలని ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ఆమె గుర్తు చేశారు. అది చాలా ముఖ్యమైందని, మూడు ఎఫ్‌లపై ఫోకస్ చేయాలని,



ఫ్యూయల్.. ఫెర్టిలైజర్, ఫోరెక్స్ పై దృష్టి పెట్టాలని ఆమె అన్నారు. గడిచిన 10 రోజుల్లోనే నాలుగు సార్లు ఇంధనం ధరలు పెరిగాయి. ముడి చమురు ధర పెరగడం పెద్ద సవాల్‌గా మారిందన్నారు. ఇంధనంతో పాటు ఫెర్టిలైజర్ల ధర అమాంతంగా పెరిగినట్లు ఆమె తెలిపారు. వీటితో పాటు పెరిగిన బంగారం ధరలు కూడా కొన్ని సవాళ్లను సృష్టిస్తున్నట్లు ఆమె అన్నారు.పశ్చిమాసియా సంక్షోభం ఓ దౌత్యపరమైన లేక రాజకీయపరమైన సమస్య కాదు అని మంత్రి తెలిపారు. ఆ సంక్షోభం వల్ల వ్యాపారవేత్తలు, సాధారణ ప్రజలు ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇంధన ధరలు పెరిగాయని, కార్గో ఆలస్యం అవుతోందని, షిప్పింగ్ ఖర్చు పెరిగిందని, ఇన్‌పుట్స్ తగ్గాయని, పెట్టుబడిపై వత్తిడి పెరిగిందని, ఎగుమతి ఆదేశాలపై అనిశ్చితి నెలకొన్నట్లు మంత్రి తెలిపారు. అన్ని ఒకేసారి జరగడం వల్ల ఆ ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ప్రస్తుతం పాజిటివ్ ఉందని ఆమె అన్నారు. కానీ కొందరు ఎప్పుడూ నెగటివ్‌గా మాట్లాడుతారని విమర్శించారు. తమ ప్రభుత్వం సాధించిన ఘనతలను హేళన చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, సుమారు లక్ష కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు మంత్రి సీతారామన్ తెలిపారు.

---

# తాజ్‌మహల్ సందర్శించిన మార్కో రుబియో

### గంటన్నరపాటు అక్కడ గడిపిన రుబియో జంట

న్యూఢిల్లీ మే 25 (నేటి దర్శిని)
అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తాజ్‌మహల్ అందానికి ఫిదా అయ్యారు. భారత్ పర్యటనలో భాగంగా ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కొద్ది సేపటి క్రితం సందర్శించారు. ఆయనతో పాటు



భార్య జెనెట్ రుబియో, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్ కూడా తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో తాజ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు తాజ్ మహల్ వద్ద దాదాపు గంటన్నర పాటు గడిపిన రుబియో దంపతులు సందర్శకుల పుస్తకంలో ప్రత్యేక సందేశం రాశారు. 'ప్రపంచంలోనే గొప్ప సంపదను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు' అంటూ రుబియో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కో రుబియో నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించేందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన కోల్‌కతా, న్యూఢిల్లీ పర్యటనలు పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో కీలక చర్చలు జరిపారు . మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత పర్యటనను పూర్తి చేసుకుని అమెరికాకు పయనమవుతారు.

# అస్సాం అసెంబ్లీలో ఉమ్మడి పౌరస్మృతి బిల్లు

న్యూఢిల్లీ మే 25 (నేటి దర్శిని)
ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ను సోమవారం అస్సాం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. బహుభార్యత్వాన్ని నిషేధించాలని, లివిన్ రిలేషన్లను రిజిస్టర్ చేయాలని, పెళ్లి.. విడాకులు, వారసత్వం అంశాల్లో ఒకేరకమైన విధానాన్ని పాటించాలన్న



ఉద్దేశంతో కేంద్ర సర్కారు యూసీసీ బిల్లును తీసుకువస్తున్నది. అయితే ఇటీవల ప్రభుత్వ ఏర్పాటు తర్వాత హిమంత బిశ్వ శర్మ సర్కారు తొలి క్యాబినెట్ భేటీలో ఆ బిల్లకు క్లియరెన్స్ ఇచ్చింది. అయితే అస్సాంలో జీవిస్తున్న షెడ్యూల్ తెగల ప్రజలు ఈ బిల్లు వర్తించదు. సీఎం హిమంత బిశ్వ శర్మ తరపున మంత్రి అతుల్ బోరా ఈ బిల్లును ప్రవేశపెట్టారు.యూసీసీ బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్రాల్లో అస్సాం మూడవ రాష్ట్రంగా నిలిచింది. ఇటీవల ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలు కూడా ఈ బిల్లును ప్రవేశపెట్టాయి. పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం లాంటి చట్టాలను సరళతరం చేయాలని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆ న్యాయం పరిధిలోకి రావాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది. యూసీసీ ప్రకారం పురుషులు పెళ్లి చేసుకోవాలంటే కనీసం 21 ఏళ్లు ఉండాల్సిందే, మహిళలకు ఆ ఏజ్‌ను 18గా ఫిక్స్ చేశారు. ఇక బహుభార్యత్వాన్ని నిషేధించారు. భార్యాభర్తలకు న్యాయపరమై హక్కుల లభించే ఉద్దేశంతో పెళ్లిళ్లు, విడాకుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయనున్నారు.

# అంత సెంటిమెంట్‌గా తీసుకోవద్దు..

### -కాక్రోచ్ జనతా పార్టీ కేసు విచారణపై సీజేఐ

న్యూఢిల్లీ మే 25 (నేటి దర్శిని)
వివాదాస్పద కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమానికి సంబంధించిన పిటిషన్ల విచారణకు తక్షణ ఆవశ్యకత లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. వాటిని అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్ నేతృత్వంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీఎం పంచోలీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను తగిన సమయంలో విచారిస్తామని పేర్కొంది. ఈ కేసును అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని న్యాయవాదులు కోరగా ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించాల్సిన అవసరం లేదని బదులిచ్చారు. ఈ విషయంలో అంత భావోద్వేగానికి గురికావద్దు అని న్యాయవాదులతో సీజేఐ వ్యాఖ్యానించారు.

**ఎక్స్ ఖాతాను సస్పెండ్‌పై హైకోర్టుకు..**

తన పార్టీకి చెందిన ఎక్స్ ఖాతాను జాతీయ భద్రతా కారణాలపై సస్పెండ్ చేయడాన్ని సవాలు చేస్తూ




కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల ఆన్‌లైన్‌లో వైరల్ అయిన వ్యంగ్య రాజకీయ పార్టీకి చెందిన దీప్కే తన పార్టీ ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఖాతాలు హ్యాక్ అయి ఆ తర్వాత సస్పెండ్ అయ్యాయని కూడా పేర్కొన్నారు.

# తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి


బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

**మిడ్జిల్, మే25 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జడ్చర్ల నియోజకవర్గంలో మిడ్జిల్ మండలంలోని వివిధ గ్రామాలలో అకాల వర్షం వల్ల వేలాది వడ్ల బస్తాలు తడిసిపోవడం అత్యంత బాధాకరమని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి అన్నారు. తడిసిన వడ్లను నాణ్యత పేరుతో తిరస్కరించకుండా ప్రత్యేక నిబంధనలతో కొనుగోలు చేయాలని, స్థానిక రైస్ మిల్లర్ల సహకారంతో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే తాత్కాలిక షెడ్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేసి మిగిలిన ధాన్యాన్ని రక్షించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఆర్థిక నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని బిజెపి నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. "రైతు నష్టపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. రైతులను ఆదుకోవడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం" అని ఆయన పేర్కొన్నారు.

# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

- మహిళా సంఘాల బలోపేతంతో గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ
- మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్వయం ఉపాధి రంగాలకు ప్రభుత్వం పెద్దపీట
- మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్ ,మే 25(నేటి దర్శిని బ్యూరో):** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందని, మహిళల సంక్షేమ కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని నాగారం గ్రామంలో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులతో కలిసి తిలకించిన అనంతరం గ్రామంలోని మహిళా సంఘ భవన నిర్మాణానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే గ్రామీణ సమాజం అభివృద్ధి చెందుతుందని, అందుకే ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు సంఘాలుగానే కాకుండా గ్రామాభివృద్ధికి కీలక వేదికలుగా మారాలని సూచించారు.నాగారం గ్రామంలో నిర్మించబోయే మహిళా సంఘ భవనం మహిళలకు శాశ్వత వేదికగా నిలుస్తుందని, ఈ భవనంలో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అవగాహన సదస్సులు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. మహిళలు సమిష్టిగా ముందుకు వస్తే గ్రామ అభివృద్ధిలో విశేష మార్పులు తీసుకురాగలరని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్వయం ఉపాధి రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం గ్రామ స్థాయిలో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తోందని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కార్యాచరణ రూపొందించబడుతోందని ఎమ్మెల్యే నాగరాజు గారు స్పష్టం చేశారు.అనంతరం గ్రామం లోని పలు సమస్యలను స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచనలు చేశారు.అనంతరం మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సందరాజు లావణ్య - సంతోష్, ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ తంగేళ్లపల్లి తిరుపతి, హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, మండల పార్టీ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందరరెడ్డి, అగ్రికల్చర్ ఏవో అనురాధ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన

- బాధితులకు న్యాయం జరిగేలా సమర్థ చర్యలు తీసుకోవాలి : జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్





**మిడ్జిల్, మే 25, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. కుటుంబ వివాదాలు, భూ సమస్యలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు మరియు ఇతర అంశాలకు సంబంధించిన పలువురు బాధితుల వినతులను ఓర్పుతో విని సంబంధిత పోలీస్ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం పోలీసు శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి చట్టపరమైన చర్యల ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి అధికారి ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ స్పందనాత్మకంగా పనిచేయాలని సూచించారు.అలాగే మహిళలు, వృద్ధులు మరియు సైబర్ మోసాలకు గురైన బాధితుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

# వడ్డెరలకు రాజకీయ న్యాయం చేయాలి

టికెట్లు ఇవ్వకపోతే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం
వడ్డెర సంఘం అధ్యక్షుడు ఇరగ దిండ్ల కృష్ణ హెచ్చరిక






**దేవరకొండ, మే 25 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర కులానికి రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతోందని దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఇరగ దిండ్ల కృష్ణ ఆరోపించారు. శాసనసభలో గానీ, శాసన మండలిలో గానీ, పార్లమెంట్‌లో గానీ వడ్డెర కులానికి చెందిన ఒక్క ప్రజాప్రతినిధి కూడా లేకపోవడం బాధాకరమన్నారు.

ఎన్నికల సమయంలో మాత్రం అన్ని రాజకీయ పార్టీలు వడ్డెరల ఓట్లు అడుగుతున్నాయని, కానీ టికెట్ల కేటాయింపులో మాత్రం చిన్నచూపు చూస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రానున్న జడ్పీటీసి, ఎంపిటిసి ఎన్నికల్లో వడ్డెర కులానికి తగిన ప్రాధాన్యం ఇచ్చి టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని షేర్ లింగంపల్లి నియోజకవర్గంలో వడ్డెర కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నారని, అక్కడ ఎమ్మెల్యే టికెట్ ఇస్తే వడ్డెర అభ్యర్థి వంద శాతం విజయం సాధిస్తాడని పేర్కొన్నారు. ఇకపై తమను నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెర విద్యార్థుల కోసం ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాళ్లు కొట్టే పనుల్లో, ప్రమాదకర రంగాల్లో పనిచేస్తున్న వడ్డెర కార్మికులకు ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్డెర కుల సమస్యలను పరిష్కరించాలని ఇరగ దిండ్ల కృష్ణ కోరారు.

# పెద్ద గుండ్ల తండాలో కిశోర బాలికల అవగాహన కార్యక్రమం



**మిడ్జిల్ మే 25,(నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని పెద్ద గుండ్ల తండా గ్రామ పంచాయతీ లో ని మార్లబాయి తండా ప్రాథమిక పాఠశాలలో కిశోర బాలికల అభివృద్ధి ఆరోగ్య అవగాహన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలికల సంపూర్ణ ఆరోగ్యం, విద్య, సాధికారత మరియు ఉన్నత భవిష్యత్తు లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, వేసవి శిక్షణ కార్యక్రమాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ రాజు నాయక్ మాట్లాడుతూ, బాలికలు విద్యతో పాటు ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కిషోరి వికాసం స్నేహ సంఘాలు వంటి కార్యక్రమాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలనిపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మాధవి బాలికల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య ప్రాముఖ్యతపై వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ ప్రభుత్వ పథకాల వివరాలను తెలియజేస్తూ, ప్రతి బాలిక విద్యను పూర్తి చేసి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.బాలికల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఫలితాలు ఇస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ ప్రజలు, మహిళలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుగొమ్ములో ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంప్

- విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా వేసవి శిబిరం
- యోగా, కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉత్సాహం




**దేవరకొండ నేరేడుగొమ్ము, మే 25 (నేటి దర్శిని):** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం సోమవారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని పీఎం శ్రీ మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి (ఎంఈఓ) పర్యవేక్షణలో గత 15 రోజులుగా కొనసాగిన ఈ వేసవి శిబిరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతిలో చేరబోయే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందించేందుకు యోగా, శారీరక దృఢత్వం కోసం కరాటే శిక్షణ అందించారు. అలాగే ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో శిబిరం సందడిగా సాగింది. ప్రభుత్వం తరఫున ప్రతిరోజూ విద్యార్థులకు ఉచిత పౌష్టికాహారం (స్నాక్స్) అందజేశారు. సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# మిడ్జిల్ మండల కేంద్రంలో ఈదురు గాలుల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ





- పునరుద్ధరణకు అధికారుల ప్రత్యేక చొరవ
- ప్రజలు, రైతులకు ఇబ్బందులు లేకుండా మిడ్జిల్ మండలంలో యుద్ధ ప్రాతిపదికన పనులు
- పనులను పరిశీలించిన ఎస్ సి భీమానాయక్ సీఈ.బాలస్వామి

**మిడ్జిల్ మే 25( నేటి దర్శిని ప్రతినిధి ):** మిడ్జిల్ మండల కేంద్రంలో ఇటీవల భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని వెంటనే గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు కొనసాగిస్తున్నారు. విరిగిపడిన విద్యుత్ స్తంభాలను



పరిశీలిస్తూ, దెబ్బతిన్న లైన్ల మరమ్మతు పనులను వేగవంతం చేయాలనిఉన్నతాధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్లు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను చీఫ్ ఇంజనీర్ బాలస్వామి ప్రత్యక్షంగా పర్యవేక్షించగా, రూరల్ జోన్ ఎస్ఈ భీమా నాయక్, ఆపరేషన్ మహబూబ్‌నగర్ డీఈ చంద్రమౌళి, జడ్చర్ల ఏడీఈ ఆపరేషన్ అధికారులు, ఏఈ నరేందర్ గౌడ్ తదితరులు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు.

గ్రామాల్లో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ తీగల మరమ్మతులు చేపడుతున్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను కూడా అధికారులు కట్టుదిట్టం చేశారు. విద్యుత్ శాఖ అధికారులుసమన్వయంతో పనిచేస్తూ, తక్కువ సమయంలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేయడం పట్ల స్థానిక ప్రజలు, రైతులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా ఆదర్శ దంపతులు డాక్టర్ యేకుల రాజారావు, ఇన్యాసమ్మ గార్ల వివాహ వార్షికోత్సవ వేడుక

- పూలే, అంబేద్కర్ ఆశయ సాధకులుగా నిలుస్తున్న పుణ్య దంపతులు: స్థానిక నాయకులు కొనియాట
- సామాజిక విప్లవ పంథాలో వీరి సేవలు అనన్య సామాన్యం

**దేవరకొండ/కొండమల్లేపల్లి, మే 25 ( నేటి దర్శిని):** సమాజంలో విద్యా విప్లవానికి, సామాజిక చైతన్యానికి నిరంతరం కృషి చేస్తున్న అక్షర శిల్పులు, ప్రముఖ విద్యావేత్తలు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ యేకుల రాజారావు, ఇన్యాసమ్మ గార్ల వివాహ వార్షికోత్సవ వేడుకలను స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు దంపతులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ... "గురువు" అనే పదానికి నిలువెత్తు రూపం రాజారావు, ఇన్యాసమ్మ దంపతులని కొనియాడారు. కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా, వేలాది మంది నిరుపేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు అక్షరాస్యతను ఆయుధంగా అందించి,



వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేసిన మహోన్నత మూర్తులు వీరని శ్లాఘించారు. వీరు తీర్చిదిద్దిన ఎంతో మంది శిష్యులు నేడు ఉన్నత పదవుల్లో రాణిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారని గుర్తుచేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల తరహాలోనే విద్యను సామాజిక విముక్తికి మార్గంగా ఎంచుకొని... డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి "చదువుకో, సమీకరించుకో, పోరాడు" అనే సిద్ధాంతాన్ని తమ జీవిత నినాదంగా మార్చుకున్నారని నాయకులు కొనియాడారు. సమాజంలో అణచివేతకు, అసమానతలకు వ్యతిరేకంగా గళమెత్తుతూ, బహుజన హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం వీరు చేస్తున్న పోరాటం అసాధారణమైనదని అభివర్ణించారు. ఒకరి ఆశయాలకు మరొకరు అండగా నిలుస్తూ... ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి తోడుగా నిలవడంలోనూ, బాధితులకు న్యాయం చేకూర్చడంలోనూ ఈ దంపతులు సమాజానికి రోల్ మోడల్‌గా నిలిచారని ప్రశంసించారు. తమ జీవితాన్ని సమాజ హితం కోసమే అంకితం చేసిన డాక్టర్ యేకుల రాజారావు, ఇన్యాసమ్మ గార్లు ఎల్లప్పుడూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, నిరంతర సేవా ఉత్సాహంతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, వారు మరిన్ని సామాజిక విజయాలు అందుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులు, మరియు వారి శిష్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని దంపతులకు శుభాకాంక్షల వర్షం కురిపించారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్య రక్షణ

- కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి, మే 25(నేటి దర్శిని):** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్యాల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార మేళాలో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల ద్వారా ప్రదర్శించిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించి, వాటి రుచిని ఆస్వాదించిన కలెక్టర్, అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు ఇలాంటి పోషకాహారం అందించాలని సూచించారు. మార్చి 6 నుంచి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ప్రతి వారం ఒక ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేశారని తెలిపారు. అదే విధంగా మహిళా వారోత్సవాలను కూడా సమిష్టిగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన మరియు సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని





తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, గ్రామీణ ప్రాంత మహిళల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల కోసం అంగన్వాడీల ద్వారా పలు పోషక విలువలతో కూడిన బలవర్ధక ఆహారాన్ని అందిస్తున్నదని చెప్పారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవనానికి నాణ్యమైన ఆహారం ఎంతో అవసరమని, మంచి ఆహారపు అలవాట్లు వ్యాధులను దూరం చేస్తాయని తెలిపారు.


మహిళా వారోత్సవాల సందర్భంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్ధిదారులు మరియు తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు నిర్వహించారు. సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లతో తయారైన ఆహార పదార్థాలను స్టాల్లల్లో ప్రదర్శిస్తూ పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ప్రత్యేక చార్టులను ప్రదర్శించారు. ఆరోగ్య శాఖ సహకారంతో గర్భిణీలు, బాలింతలు మరియు కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వంటల పోటీలలో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పీడీ డీఆర్‌డీఓ/డీడబ్ల్యూఓ శ్రీలత, సీపీఓ సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, పీడీ మెప్మా, సీడీపీఓ శాంతికుమారి, వివిధ ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు మరియు డీడబ్ల్యూఓ సిబ్బంది పాల్గొన్నారు.

# 103 లక్షలతో సైడ్ డ్రైనేజీ అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**ఉమ్మడి వరంగల్, మే 25 (నేటి దర్శిని బ్యూరో):** నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ నగర పరిధిలోని 30, 31 డివిజన్ పరిధిలో రూపాయలు 1.3 లక్షలతో సైడ్ డ్రైనేజ్, అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు .వరంగల్ లో ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వము అధికారులు చర్యలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# జి డబ్ల్యు ఎం సి ప్రజావానికి 103 దరఖాస్తులు



**ఉమ్మడి వరంగల్, 25 (నేటి దర్శిని బ్యూరో):** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జి డబ్ల్యూ ఎం సి అదనపు కమిషనర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వివిధ విభాగాలకు చెందిన103 ఫిర్యాదులు ప్రజల నుంచి స్వీకరించారు. అందులో టౌన్ ప్లానింగ్ సంబంధించిన 48 దరఖాస్తులు, ఇంజనీరింగ్ విభాగానికి 32 ,రెవెన్యూ విభాగానికి 9 ,శానిటేషన్ విభాగానికి 10, నీటి సరఫరా విభాగానికి 4 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

# విద్యార్థుల్లో ప్రతిభ వికాసమే లక్ష్యం

- ఘనంగా ముగిసిన వేసవి శిక్షణా శిబిరం
- విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన మండల విద్యాధికారి అంజయ్య




**చింతపల్లి, మే 25 (నేటి దర్శిని):** ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీటీ నగర్‌లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరం 15 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించి ఆదివారం ఘనంగా ముగించారు. శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, యోగ, నృత్యం, పాటలు తదితర సృజనాత్మక కార్యక్రమాలలో శిక్షణ అందించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి నీరుడు అంజయ్య విద్యార్థులను అభినందించి, ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. కృష్ణవేణి, సీనియర్ ఉపాధ్యాయులు బాల్ రెడ్డి, మణిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిసిపి....

**ఆమనగల్,మే25(నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న వరి కొనుగోలు కేంద్రాన్ని మహేశ్వరం జోన్ డీసీపీ



నారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. మార్కెట్ యార్డులో ఉన్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులను వడ్ల కొనుగోలు ఏ విధంగా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం త్రాగునీరు,నీడ ,కూర్చునే ఏర్పాట్లు,టోకెన్ విధానం, పారిశుద్ధ్యం, సక్రమంగా తూకం వేయాలని, అధికారులను డీసీపీ ఆదేశించారు. క్యూలైన్లు కనబడటం చెయ్యాలని, మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరపాలని సూచించారు.రైతుల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు రాకుండా స్థానిక పోలీసులతో సంబంధం చేసుకోవాలన్నారు. రైతుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొల్కులపల్లి మిల్లులో ధాన్యం సేకరణ ప్రక్రియ సరిగ్గా జరపటం లేదని డిసిపి దృష్టికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ తీసుకెళ్లారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పిఎసిఎస్ సీఈఓ దేవేందర్ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపి జానకి రెడ్డి,ఆమనగల్ ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు,ఏఎంసి డైరెక్టర్ తాళ్ల రవీందర్,పోలీస్ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# జిహెచ్ఎంసి ప్రజావాణిలో సమస్యల పరిష్కారంపై ప్రజల ఆగ్రహం

- అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- "ఫిర్యాదులు మాత్రమే.. పరిష్కారాలు లేవు" -- ప్రజావాణిలో ప్రజల అసంతృప్తి
- ప్రజావాణిలో జిహెచ్ఎంసి అధికారులను నిలదీసిన ఫిర్యాదుదారులు
- హైదరాబస్తీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- అక్రమ నిర్మాణాలకు అండగా అధికారులు..? ప్రజావాణిలో ఆరోపణలు




ప్రభుత్వ లీజ్ ల్యాండ్ స్థలంలో అక్రమ నిర్మాణం





**హైదరాబాద్,మే25 (నేటి దర్శిని)** తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ప్రజల ఆగ్రహం రోజురోజుకూ తీవ్రంగా పెరుగుతోందనే దానికి సోమవారం జరిగిన జిహెచ్ఎంసి ప్రజావాణి కార్యక్రమం ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. ఇప్పటికే నాలుగు నుంచి ఐదు సార్లు అంతకంటే ఎక్కువ ఫిర్యాదులు ఇచ్చినా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ పలువురు ఫిర్యాదుదారులు ప్రజావాణిలోనే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోయినా "సాల్వ్ అయింది" అంటూ తప్పుడు మెసేజ్లు పంపిస్తున్నారని బాధితులు మండిపడ్డారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, లాయర్ నాగిళ్ల శ్రీనివాస్ అధికారుల పనితీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజావాణిలో కూర్చొని కూల్ డ్రింక్స్, స్నాక్స్ తింటూ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా హేళన చేస్తున్నారు. పబ్లిక్ టాక్స్‌తో మీ జీతాలు వస్తున్నాయి. మేము నాలుగైదుసార్లు తిరిగిన మీరు పని చేయకుంటే మా ఓపిక ఎలా ఉంటుందో మీకు తెలుసా.? మాటలు బంద్ చేసి పని చేయండి" అంటూ ఉన్నత అధికారులను ప్రజలు నిలదీశారు.

**హైదరబస్తీలో అక్రమ నిర్మాణాల దందా**

సికింద్రాబాద్ కవాడిగూడ సర్కిల్ పరిధిలోని హైదరాబస్తీలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని నాగిళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారని, ప్రభుత్వ లీజ్ ల్యాండ్ స్థలాలలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది బిల్డర్లు జిహెచ్ఎంసి అధికారులను మేనేజ్ చేస్తూ ఫ్లోర్ వారీగా డబ్బులు ముట్టజెప్పి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.

**హైకోర్టులో కేసులు నడుస్తున్నా చర్యలు లేవు**

జిహెచ్ఎంసిలో అవినీతి అధికారుల ముందు కోర్టు ఆదేశాలు కూడా పనిచేయడం లేదు కేవలం ధనార్జన లక్ష్యంగా కోర్టు ఆర్డర్లను పక్కనపెట్టి అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజలు ఫిర్యాదులు ఇస్తే అధికారులు సమస్య పరిష్కారం కాకముందే 'సాల్వ్ అయింది' అంటూ తప్పుడు మెసేజ్లు పంపుతున్నారు. ఇది మొత్తం ఒక గేమ్‌లా మారిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. సాక్షాత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ పూర్తిగా అవినీతిమయం కావడంపై ముఖ్యమంత్రి అభిమానులు కూడా ఆంధ్రుల వ్యక్తం చేస్తున్నారు.

**లంచాలకే అధికారుల మెతక వైఖరి..**

జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ అధికారులు కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోవడానికి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఉన్న అధికారులకు లంచాలు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. "కింద స్థాయి అధికారుల నుంచి వచ్చే మామూళ్లకు ఆశపడి జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారు. అందుకే అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు" అని నాగిళ్ల శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమస్యలు తీర్చాలని

ప్రజలు 10 నుంచి 15 సార్లు ప్రజావాణి చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ పాలన ఇలా కొనసాగితే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుంది అని ఆయన హెచ్చరించారు.

**ఫోన్లు డిపాజిట్ చేయించడంపై అనుమానాలు..**

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో

ప్రజావాణికి వచ్చే వారితో మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేయిస్తున్నారని, దీనిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "ప్రజలు తిరగబడితే వీడియోలు బయటకు రాకూడదనే ఉద్దేశంతో ఫోన్లు తీసుకుంటున్నారు. ఆ గదిలో కెమెరాలు కూడా ఉండవు. ప్రజలకు పారదర్శకత ఎక్కడ.? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం పారదర్శక పాలన అందించాలి కానీ దానిని మరిచి అధికారులు ఫోన్లు దాచి పెట్టడం వాళ్ళ అవినీతిని బయటకు రాకుండా అడ్డుకోవడం జరుగుతుందని మండిపడ్డారు. జిహెచ్ఎంసి కమిషనర్ ప్రజావాణికి అసలు రారని వచ్చిన ఒకరోజు ఏదో చిన్న ముచ్చటి చెప్పి వెళ్లిపోవడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ప్రధాన కార్యాలయంలో ఉన్న మీడియా కూడా జిహెచ్ఎంసి లో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తీసుకురాక పోవడం చూస్తుంటే బాధాకరంగా ఉందన్నారు.

**అధికారుల సస్పెన్షన్‌కు డిమాండ్..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ప్రతి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో

అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజల ఫిర్యాదులను పక్కనపెట్టి అవినీతి అధికారులకు మూటలు కట్టడం ప్రభుత్వానికి తగదని ప్రభుత్వ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. అవినీతికి అక్రమాలకు సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్, జోనల్ సి పి, కవాడిగూడ సర్కిల్ సిబ్బంది, అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్ పుష్పలతను వెంటనే సస్పెండ్ చేయాలని నాగిళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలను కూల్చివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డిప్యూటీ కమిషనర్ పుష్పలత పూర్తి బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని పత్రికల్లో ఆమె అవినీతిపై కథనాలు వస్తే రిపోర్టర్లను కూడా బెదిరింపులకు గురిచే చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారుల అవినీతిని ప్రశ్నించే మీడియాపై అధికారులు మండిపడడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి చేసే అధికారులు జిహెచ్ఎంసిలో చాలామంది ఉన్నారని వాళ్లపై చర్యలు తీసుకునే దమ్ము కమిషనర్కు ఉందా అన్నారు.

ప్రజావాణిలో వినిపించిన ఈ ఆగ్రహ స్వరాలు ఇప్పుడు జిహెచ్ఎంసి పాలనపై మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన వేదికగా ఉండాల్సిన ప్రజావాణి, ఫిర్యాదుదారుల ఆవేదన వేదికగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- హౌసింగ్ పీడీకి సర్పంచ్ తంగేళ్ల రామకృష్ణ వినతి



**చింతపల్లి మే 25 (నేటి దర్శిని):** నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయంలో హౌసింగ్ పీడీని సోమవారం హరిజనాపురం గ్రామ సర్పంచ్ తంగేళ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో అనేక మంది పేద కుటుంబాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారికి న్యాయం చేయాలని కోరారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలతో దరఖాస్తులను అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ తంగేళ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## వనస్థలిపురంలో ఘనంగా 'కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్' ప్రారంభోత్సవం

**వనస్థలిపురం, మే25 (నేటి దర్శిని):** చిన్నారుల సమగ్ర అభివృద్ధి, సృజనాత్మకత మరియు నాణ్యమైన విద్యా ప్రమాణాలే లక్ష్యంగా వనస్థలిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్' ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ప్రముఖులు, విద్యావేత్తలు, తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర రెడ్డి విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మౌనిక హరినాథ్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక ప్రపంచంలో




చిన్నారులకు చిన్నతనం నుంచే బలమైన విద్యా పునాది వేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మాంటెస్సోరి మరియు కేంబ్రిడ్జ్ ఆధారిత ఆధునిక విద్యా విధానాల కలయికతో, పూర్తిగా కార్యాచరణ ఆధారిత పద్ధతిలో ఇక్కడ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. కేవలం చదువే కాకుండా పిల్లల మానసిక వికాసానికి ఉపయోగపడే ప్రత్యేక మైండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. చిన్నారులకు ఎంతో అనుకూలమైన, పూర్తి సురక్షితమైన క్యాంపస్‌తో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సహాయక సిబ్బందిని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దూర ప్రాంతాల పిల్లల కోసం ప్రత్యేక రవాణా సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, ప్రస్తుతం పరిమిత సంఖ్యలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్పష్టం చేశారు. ఈ శుభ సందర్భంగా వనస్థలిపురం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పాఠశాలను సందర్శించి, చిన్నారుల విద్యా ప్రయాణానికి తమ ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎల్బీనగర్ పిఎస్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తిమృతి..



**ఎల్ బినగర్ మే 25:- (నేటి దర్శిని):** ఎల్ బినగర్, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ గుంటి జంగయ్య కాలనీ ప్రధాన రహదారిపై గత రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి(45) పడిపోయి ఉండడంతో స్థానికులు గమనించి ఎర్బీనగర్ పోలీస్లకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని కింద పడిపోయిన వ్యక్తిని పరిశీలించగా అతను అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలించగా అతని ఎలాంటి ఆధారాలు లబించలేదు. అతని కుడి చేతిపై కాలిన గాయం, కూడి కాలికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కట్టు వేసి ఉందని పోలీసులు గుర్తించారు. మృతి చెందిన ఆహారం లేకపోడం వల్ల మరణించి ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరుకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్కు తరలించారు.

## రంగారెడ్డి జిల్లాలో ప్రజావాణికి 101 ఫిర్యాదులు

- సమస్యల తక్షణ పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు






**రంగారెడ్డి, మే 25 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 101 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలిస్తూ త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 37 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించిన 64 ఫిర్యాదులు అందగా, మొత్తం 101 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి (లోకల్ బాడీస్), వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అందాల గత్తర లేపిన రకుల్.

# దృశ్యం 3’ బాక్సాఫీస్ సునామీ..
## కేవలం 58 గంటల్లో రూ.100 కోట్ల మైలురాయి!




ఇండియన్ సినిమా చరిత్రలో అత్యంత విజయవంతమైన సస్పెన్స్-క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో ‘దృశ్యం’కు ప్రత్యేక స్థానం ఉంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కలయికలో వచ్చిన తొలి రెండు భాగాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ నుంచి వచ్చిన ‘దృశ్యం 3’ బాక్సాఫీస్ వద్ద మరోసారి సంచలనాలు సృష్టిస్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో దూసుకుపోతూ కొత్త రికార్డులకు నాంది పలుకుతోంది.‘దృశ్యం 3’ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన కేవలం 58 గంటల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు హీరో మోహన్‌లాల్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన, “గత 13 సంవత్సరాలుగా ఈ ప్రయాణంలో మాతో పాటు ఉన్న ప్రతి ప్రేక్షకుడికి ధన్యవాదాలు. మీరు చూపించిన ప్రేమ, నమ్మకం, మద్దతు మమ్మల్ని మరింత ఎమోషన్‌కి గురి చేస్తున్నాయి” అంటూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా మొదటి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.117.17 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు తెలుస్తోంది. మాలీవుడ్ చరిత్రలోనే అత్యంత వేగంగా భారీ వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద మాత్రమే కాదు.. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్‌లో కూడా ‘దృశ్యం 3’ దూకుడు కొనసాగుతోంది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మూడో రోజు ఏకంగా 3.62 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు మేకర్స్ వెల్లడించారు. వీకెండ్ కావడంతో ఆదివారం కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొదటి రెండు భాగాలతో పోలిస్తే ‘దృశ్యం 3’పై ప్రారంభంలో మిశ్రమ స్పందనలు వచ్చాయి. గత భాగాల్లో ఉన్న సస్పెన్స్, ఇన్వెస్టిగేషన్ ఎలిమెంట్స్ ఈసారి కొంత తగ్గాయని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథలో భావోద్వేగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది.జార్జ్‌కుట్టి పాత్రలో మోహన్‌లాల్ మరోసారి తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు ఆయన చేసే పోరాటం, గత సంఘటనల ప్రభావం, పోలీసుల ఒత్తిడి నేపథ్యంలో కథను భావోద్వేగంగా తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది.
తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.

# లక్కీ ఛార్మ్ త్రిష
## ముగ్గురు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో ‘త్రిష లక్కీ ఛార్మ్‘ అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. ‘వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది‘ అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బిగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను ‘లక్కీ ఛార్మ్‘ అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# యాక్షన్ మోడ్‌లోకి అక్షయ్



గత కొన్నేళ్లుగా వినోదప్రధానమైన చిత్రాలు, భావోద్వేగ కథలతో ఆడియన్స్‌ని అలరిస్తున్న బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ త్వరలో యాక్షన్ మోడ్‌లోకి రానున్నారు. పూర్తిస్థాయి యాక్షన్ సినిమాలో ఆయన నటించి చాలా ఏళ్లయింది. ఆ లోటును భర్తీ చేస్తూ అక్షయ్ చేస్తున్న భారీ యాక్షన్ డ్రామా ‘సముక్’. కనిష్క్ వర్మ దర్శకుడు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాత. భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ ‘అక్షయ్ పూర్తిస్థాయి యాక్షన్ మోడ్‌లోకి తిరిగి వస్తున్నారు. ఇది ఓ ఏలియన్ సర్వైవల్ థ్రిల్లర్. హారర్ అంశాలతోపాటు, మిలిటరీ రియలిజం కూడా ఇందులో ఉంటాయి. అంతర్జాతీయ సాంకేతిక బృందం ఈ సినిమాకోసం పనిచేయబోతున్నది. ‘సముక్’ భారతీయ సినీ చరిత్రలో ఇంతకు ముందు రాని ప్రయత్నం’ అని తెలిపారు.

# టాక్సిక్‌లో లేడీ విలన్స్?



సినిమా కలర్‌ఫుల్‌గా ఉండాలంటే అందమైన హీరోయిన్ల అవసరం ఎంతైనా ఉంది. హీరోయిన్ అంటే సినిమాకు ఓ ఆభరణం. కథకు అందాన్ని తేవడంతోపాటు కథను నడిపంచడంలోనూ హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తుంటారు. అయితే.. అదే బాధ్యతను పానిండియా సినిమా ‘టాక్సిక్’ విషయంలో మరో విధంగా నిర్వర్తిస్తున్నారు అగ్ర కథానాయికలు నయనతార, కియారా అద్వానీ. ఈ సినిమాలో వారిద్దరూ బ్యాడ్యాస్ ఉమెన్‌గా కనిపించబోతున్నారు.పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో వీరి పాత్రలు సాగుతాయట. తెరపై వీరి పాత్రలు ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని ఇస్తాయట. ఈ విషయాన్ని స్వయంగా చిత్ర కథానాయకుడు యష్ తెలిపారు. ‘ఈ తరహా పాత్రల్లో వారిద్దరినీ ఆడియన్స్ ఊహించి ఉండరు. నయన్, కియారా నటన ఈ సినిమాలో నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. వారిద్దరి కదలికలే కొత్తగా ఉంటాయి’ అని తెలిపారు యష్. ఆయన హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హ్యూమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పానిండియా చిత్రం ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365